"యెంకివంటి పిల్ల లేదోయ్, లేదోయ్!
యెంకి నా వొంకింక రాదోయ్, రాదోయ్!"

# ట్రాం టకటకల్లో నలిగిన స్వాప్నిక గాథ

● యల్లాపంతుల వేంకటరమణయ్య ●

సుందరం ట్రాం ఎక్కుతూనే ఆగాడు, ఆశ్చర్యంతో చూస్తూ. ఎదురుగా ఒక అమ్మాయి కూచుంది. ఆమె కళ్ళు మెరిశాయి, ఇతన్ని చూసి. వాళ్ళు పరస్పరం గుర్తించుకున్నట్టు తోచింది. ఆమె లజ్జారుణ కపోలాలమీద కో నవ్వు రేఖ ప్రాకింది. అతని మెదడులో ఏదో కదిలింది. అతని మనోరంగంలో జ్ఞాపకాల తెరలన్నీ త్వరత్వరగా పైకిలేచి ఒక అనుభవాన్ని చూపెట్టాయి.

... ... ...

కిటకిటలాడుతున్న కలకత్తా మెయిలులో, ఆర్నెల్లక్రితం ఒకరాత్రి ఆమెతో అతను మద్రాస్ నుండి రాజమండ్రీవరకూ ప్రయాణంచేసిన దృశ్యమది. రైలంతా చెలరేగిన జనసమ్మర్దం. పెట్టెలలో పెట్టబడిన జనార్ణవం. అతనో చిన్నపెట్టెలో ఎక్కాడు. అప్పటికప్పుడే అందులో కూచుందికి స్థలంలేక కొంతమంది నించున్నారు. మధ్య బెంచీ అంచున ఆ అమ్మాయి కూర్చుంది. ఆ బెంచీ మిగతా స్థలానికి అధిపతులు :—ఓ ఆంగ్లో ఇండియన్ అమ్మాయీ, దిగ్గజాల్లాంటి ఇద్దరు విశ్వస్తలూ, వాళ్ళతాలూకు రెండు తాళవృంతాలు, రెండు రాగిచెంబులూ, రెండు భూతిగోళాలూ, ఒక విద్యార్థినీ, ఆమె నీరసం, రూపురేఖవిలాసాలే గాని ఇతర ప్రయాణీకుల్ని ఇబ్బందిపెట్టడానికింకేమీలేని మారీచసుబాహుల్లాంటి సుపుత్రద్వయంతో, శూర్పణఖవంటి సుకుమార పుత్రికారత్నంతో, చిన్నప్పుడు చదువుకున్న వాచకంలో తాటకి బొమ్మలు జ్ఞప్తికితెచ్చే ఓ ద్రావిడస్థానపుటంగన—అతనాలోచించి, ఆ బెంచీపక్కన తన పెట్టె పెట్టి, దానిమీద తన పరువుపెట్టి, ఓ మెత్తని 'సీటు' చేసుకుని, ఆ అమ్మాయి పక్కన కూర్చున్నాడు.

తండోపతండాలుగా ఇంకా ఇంకా మహాప్రవాహంలా వస్తున్నారు ప్రజ, ఆ మహాధూమశకట యాత్రకు- కలకత్తా మెయిల్ ఏ నందనోద్యానానికో ఎగిరిపోయే పుష్పకవిమానమయినట్లు. "మనం ఎటువంటి మహాత్యాగాల్ని చేస్తున్నాం!" అనుకున్నాడు, సుందరం. "కాళ్ళూ, కీళ్ళూ, ప్రాణాలుకూడా అర్పించేస్తాం, ప్రయాణాల్లో. కాని మాకు ఫలాపేక్షలేదు. మాది గొప్ప సహనశక్తి. గాడిదల్లాగ, గానుగ ఎద్దుల్లాగ, గౌతమబుద్ధుల్లాగ, దేనినీ ప్రశ్నించకుండా అన్నిటినీ స్వీకరిస్తాం, కాకీదుస్తులూ క్షామాలూవచ్చి మా కడుపుల్ని దహించేస్తే మా జాతిమతభేదాలు మరచిపోయి సంఘీభావంతో చచ్చిపోతాం. సందులగొందుల పద్మవ్యూహాల్లో మురికి కాలువలను మందాకినులగా స్వీకరించి, సూర్యకిరణం దూరలేని ఇరుకుగదుల్లో మా కవులు ఆలాపిస్తారు. మాకు ఫలాపేక్షలేదు. ముమ్మాటికీలేదు. మాకేమీ అక్కర్లేదు. మేమేమీ అడగం. అడిగే శక్తీలేదు. శతాబ్దాలనుంచీ మామా ప్రత్యణువునందూ జీర్ణించిన బానిసత్వం మా అదృష్టం—"

"మీ రెక్కడికి వెళతారు?" అంది, అమ్మాయి.

తన ఆలోచనల్ని విదల్చుకుంటూ సుందరం సమాధానం చెప్పాడు. ఆమెనుండి తన చూపుల్ని మరల్చుకోలేకపోయాడు. ఆమె ప్రత్యేక అందం ఆమె పక్ష్మాలు. ఆమె కనురెప్పల వెంట్రుకలు

---

* ఆనందవాణి

నల్లగా, దీర్ఘంగా, ఆమె కళ్ళ కాటుక అంచులు ప్రసరించే నల్లని కిరణాల్లాగా ఉన్నాయి... లోగడ అతను ఓఢ్రదేశంలో ప్రయాణం చేస్తున్నప్పుడు, తన స్వప్నానుభూతికికూడా అందని అందమైన అమ్మాయిని చూసి తీరని వేదనపడ్డాడు. ఉజ్జ్వల సౌందర్యానికి ముఖాముఖి నించోడంలో సున్నితమైన అనుభూతులుగల హృదయం ఎంతో వేదన పడుతుంది. ఆ సౌందర్యఅవలోకనంలోని విఫలతా, నిస్సహాయతా, వీటితో మూలిగి, జనని గర్భంలోంచి యీ విశాలత్వంలోకి ప్రవేశించిన ఘడియని ద్వేషిస్తుంది...అలాగే ఆ అమ్మాయిని చూడగానే ఏదో నొప్పికలిగి, అర్థంగాని బెంగ అతన్నావరించింది.

అప్పుడే బేసిన్ బ్రిడ్జి దాటారు. రైలు దూసుకుపోతోంది. చప్పున అతనికి వాళ్ళమ్మతో చిన్నప్పుడుచేసిన ప్రయాణం జ్ఞాపకంవచ్చింది. అమ్మ పక్కన ముడుచుకుని, ఆమె నానుకుని, కూర్చోడం. తనూ, అమ్మా, అంతే. నాన్నలేడు......

రైలు సాగనిచ్చి ప్రయాణికులంతా సర్దుకోవడం మొదలుపెట్టారు. కాస్త జరగమని అతని పరుపు మీద ఇంకొకడు కూర్చున్నాడు. ఆమె కింకా కొంచెం దగ్గరగా తను చేరాడు. అంత అందమైన అమ్మాయికి అంత దగ్గరగా ఉండడం అతని చాలా ఆరాటపెట్టింది. ఏమీ తోచక పుస్తకంతీసి చదవడం ఆరంభించాడు. కాని చూపులు స్థిరంగా పుస్తకంమీద నిలవక, ఆమె తొడలమీదికిప్రాకి, నడుంచుట్టూ పరిభ్రమించి, గుండ్రని జబ్బలమీద నించి తిరిగి పుస్తకంమీదికి చేరుకుంటున్నాయి. ఒకటి రెండుసార్లు మళ్ళా ఆ అందమైన కనురెప్పలకేసి అతని చూపులు తిరిగి, ఆమె చూపులతో కలిస్తే, వణుకుతున్న వేళ్ళతో పేజీలు తిరగేశాడు—రైలు సూళ్ళూరుపేట దాటింది.

కొంత సేపటికి ఎదురుబెంచీమధ్య కూర్చున్న ఆమె తండ్రితో అతనికి పరిచయం కలిగింది. అప్పటిదాకా ఆమె ఎవరితో ప్రయాణం చేస్తోందో, ఎక్కడికో, తెలీదు. కాఫీ, సోడా వగైరాలు



ఒకరికొకరు అందించుకోవడం మొదలైనవాట్లో వాళ్లు సన్నిహితులయారు. ఆమెకూడా స్వేచ్ఛగా మాటాడింది. తెచ్చుకున్న ఫలహారాల బుట్ట తీసి, ప్లేటులోవేసి తనకికూడా ఇచ్చింది. ఆమె వేళ్ళ తీవ్రసంచలనం, ఒద్దంటూన్నా వినిపించుకోక చిరునవ్వులతో మొహమాటపెట్టి తినిపించడం, ఆకనురెప్పల క్రీనీడలు—అతని కేదో ఐంద్రజాలికలోకంలో ఉన్నట్టుంది. అమ్మ చనిపోయాక ఎవరిచూపులలోనూ అతనికి అంతదయ లభింపలేదు.

సంభాషణలో ఆమె తండ్రి చెప్పాడు: మొగల్ సరాయిలో ఉన్న భర్తదగ్గరకి ఆమెని దిగబెడుతున్నాడు. వివాహం ఆరునెలలక్రితమే అయింది. ఉద్యోగపు చుట్టుకొలతల్లో ఉన్నవాడు గనక, ఏడు రోజులు మాత్రమే శెలవుపెట్టి, వరుడు పెళ్ళిముహుర్తానికి రాగలిగాడు. తన నెవరో అమాంతం రైల్లోంచిదూకి పారిపొమ్మనట్టుగా అదిరిపడ్డాడు, సుందరం. మొగల్ సరాయి! అన్ని వందలమైళ్ళదూరం యీమెని తీసికెళ్తాడట! యీ వజ్రాన్ని, యీ సౌగంధికకమలాన్ని, యీ అప్సరసని తీసికెళ్ళి మొగల్ సరాయిలో ఎక్కడో ఉన్నవాడి చేతిలో పెడతాట్ట! ఎందుకు? ఎందుకు? అని ప్రశ్నించుకున్నాడు. అతని కొకటే తోచింది. ఆమె శరీరవాంఛలు తీర్చుకునేందుకు! తీగ, దగ్గరనున్న చెట్టువైపు కొనలుసాగి చెట్టుని పెనవేసుకున్నట్టే స్త్రీల యవ్వనపు కోర్కెలు చెంతనున్న పురుషుడివేపు కొనలు సాగి, పెనవేసుకుంటాయి. 'యీడొచ్చిన పిల్ల, ఎన్నాళ్ళింటో ఉంచుకోం?' అంటారు, తల్లిదండ్రులు......

రైలు నెల్లూరు దాటింది. నిద్రావేశం ఆపుకోలేక, రకరకాల వృత్తరేఖల్ని గీస్తున్నాయి, ప్రయాణికుల తలలు. నిల్చున్నవాళ్లు ఏదో బల్లని పట్టుకుని నిల్చునే కునుకుతున్నారు. అదృష్టవంతుడైన ఓ మిలిటరీ రథికుడు కింద చతికిలపడి దొడ్డి తలుపుకు తల చారేసి నోరు తెరచి తన గురకలో రైలు శబ్దాన్ని లీనంచేసుకుంటూ నిర్వాణస్థితిలో ఉన్నాడు. నిద్రనే ఆపుకోలేరే, మధురమైన అనుభూతులలోంచి జనించిన వాంఛల మాటేమిటి, అనుకున్నాడు.

పక్క తిరిగి ఆమెని చూశాడు: అందమైన కనురెప్పలు నిద్ర బరువుకి మెల్లిమెల్లిగా మూసుకుంటున్నాయి. తనని చూసి ఆమె చిరునవ్వునవ్వి ఒళ్లు విరుస్తూ 'నిద్ర ఒస్తోందండీ!' అంది. 'అలాగే నిద్రపొండి' అన్నాడు. మృదువుగా తలవాల్చి, అలాగే నిద్రపోతోంది, జాలిగొలుపుతూ. ఆ కనురెప్పల్నీ, పక్ష్మాల్నీ చూస్తున్నాడు. ఎంతో సమ్మోహనంగా ఉన్నాయి. ఆ భంగిమలో ఆమె ఒక అపూర్వమైన చిత్తరువులాగా ఉంది. మైదాబస్తాల్లాంటి ఆ విస్వస్తల్ని అవతల కీడ్చేసి ఆమెకి పక్కవేసి పడుకోపెడదామనుకున్నాడు. కాని సిసలైన ఆంధ్రుడు. భావవిప్లవమే కాని కార్యవిప్లవానికి నోచుకోని జాతిలోనివాడు. రెయిలుపెట్టె కిటికీలో తలవాల్చి ఆమె తండ్రి నిద్రపోతున్నాడు. ఆమెతల మెల్లిగా, జాలిగా, ఇంకా వాలిపోతోంది. తనమీదకి ఒరిగిపోతోంది. మెత్తని బరువు! పాపం, ఆమెకి తెలీదా? నిద్రావస్థలో ఉంది. పోనీ, అలా నిద్రపోనీ, పసిపాపవలె, అనుకున్నాడు. ఇంకో క్షణంలో ఆమెతల తనభుజంమీద వాలిపోయింది. అతని కేదో వెర్రి ఆనందం కలిగింది. తనుకూడా నిద్రపోతున్నట్టు కళ్ళుమూసుకుని తలవాల్చడం మొదలుపెట్టాడు. తన భీరుత్వానికి తనే ఆశ్చర్యపడ్డాడు. తనెప్పుడూ స్వంత ప్రోద్బలాలప్రకారమే నడుస్తాడు: ఇతరుల అభిప్రాయాల్ని లక్ష్యపెట్టనివాడు. తనమీదికి అలా ఒరిగిపోవడం ఆమె! ఇద్దరికీ బాగుంది. అటువంటప్పుడు ఎదుటివాళ్లు ఏమనుకుంటారో అని నిద్రనటించడం ఎందుకు, అనుకున్నాడు. ఒకటి రెండుసార్లు కళ్లువిప్పి అందర్నీ కలయబారి చూసి, ఆమె అలా నిద్రపోవడం తనకి తెలుసునని తెలియచేశాడు. అంతా కునుకుపాట్లు పడుతున్నారు. నల్లని పొడుగాటి జడ అతని వీపుమీదనుంచి జారింది. ఆ అబలని,

తనమీదఅలావాలిపోయిన నిస్సహాయని, తను రక్షించాలి. మొగల్‌సరాయి ముష్కరులనుండి రక్షించాలి. ఆమె జుట్టు అతని చంపల్ని తాకుతోంది. అతని కేదో మైకంగా ఉంది. రెండు ఉత్తుంగ శైలాగ్రాలవేపు గట్టుమీద నడుస్తున్నట్టుగా ఉంది. గట్టు జారుడుగా ఉంది. అతని కడ్డంగా ఏదో జంతువు వచ్చింది. ఆమె తండ్రిరూపంలో జంతువు. తోలబోయేసరికి "అమ్మాయీ, అమ్మాయీ!" అనిఎవరోపిలిచినట్టయింది. అమ్మాయిని లేపి "అదేమిటమ్మా! అతనిమీద పడిపోతున్నావు పాపం!" అని ఆమె తండ్రి మళ్ళా కిటికీలో తలవాల్చి నిద్రపోయాడు.

ఆమె మేలుకుని సరిగా కూర్చుంది. చెంపలు చెమర్చి ఎర్రబడ్డాయి. "అయితే చెప్పరండీ, నేనిలా నిద్రపోతే!" అంది. కనురెప్పల చీకట్లలో నవ్వు వెన్నెలలు దాక్కుంటున్నాయి. ఇంకొంచెం అతనివేపు జరిగి ఒరుగుతోంది. ఇద్దరి రక్తనాళాల్లోనూ తీవ్రమైన తుపాన్లు. కోరికల నిద్రలో స్వప్నాలకోరికల్లో అరమోడ్పు రెప్పలకిందచి భారంగా చూస్తున్నాయి. అంతమందిమధ్యనా, వాళ్ళదేహాల్లో భగ్గుమని జ్వాలలు. రైలుపెట్టె అకస్మాత్తుగా తాము వినా నిర్మానుష్యమైతే!

మళ్ళా తనభుజంమీద తలవాల్చి ఆమె నిస్సంకోచంగా నిద్రపోయింది. తండ్రి చూసినట్లేచూసి ఏమీ అనలేదు. కాస్సేపు తనమీద వాలి నిదరోవడం, మళ్ళా లేవడం—యిద్దరూ నవ్వుకోవడం, ఆ మధురరాత్రి అలాగే జరిగిపోయింది.

"లేపకే నా యెంకి లేపకే నిదురా
యీపాటి సుకము నే నింతవర కెరుగనే!"

అప్రయత్నంగా అతని గుండెలు సంగీతం పాడాయి.

తాడేపల్లిగూడెంలో జనప్రవాహం ఎక్కువైంది, ఇంకా. రెండు బెంచీలకీ నడుమ మనుషుల గోడ మొలిచింది. ఆమె చాలా చెప్పింది, అతనితో. ముఖ్యమైనవి—ఆమె భర్త నిదివరకెన్నడూ ఎరగననీ, ఆర్నెల్లక్రితం హడావిడిగా జరిగిన పెళ్ళిలో అతన్ని చూడడం అనీ, ఇప్పుడతన్ని పోల్చుకోలేకపోవచ్చుననీ, ఎందుకో చాలా బెంగగా ఉందనీ, చెప్పింది.

రెయిలు గోదావరి వంతెనమీంచి సాగిపోతోంది. కాని వాళ్ళకి గోదావరి కనిపించలేదు. సుందరం గోదావరి స్టేషనులో దిగిపోవాలి. ఆ ఆలోచనే బాధగా ఉంది. అతన్ని నిలువునా కోసినా అంతబాధ కలగకపోవును. కాని, బాధనంతా లోలోపనే అణిచేసుకుని, అనుభవాన్ని చిరునవ్వుతో వీక్షిస్తూ దిగిపోవడమే కర్తవ్యమని నిర్ణయించుకున్నాడు. అకస్మాత్తుగా తన చెయ్యి పట్టుకుందామె. "మనం మళ్ళీ కలుసుకుందాం: మద్రాస్‌లో. తప్పకుండా కలుసుకుందాం. ఆర్నెల్లలో వస్తాను. మీరు అక్కడే ఉంటారుగా!" అందామె. అఖండగౌతమివారధి మీద రెయిలు బండిలో, ఆర్ద్రంగా ఆమాటలు అన్న ఆమె కంఠధ్వని ఏదో ప్రాణఘోషవలె సుందరం గుండెల్లో నేటికీ మ్రోగుతోంది! చెదరిన ముంగురులు, నిద్రబడలికల ఎర్రనికళ్ళు, నలిగిన గులాబీ చీర—ఆ లావణ్యవిగ్రహాన్ని తీసుకుని రెయిలు సాగిపోయింది. మొగల్‌సరాయికి కొత్త కాంతి!

... ... ...

మళ్ళా యీనాడు ఆమెను ట్రాంబండీలో చూశాడు, సుందరం. సంఘటనలన్నీ మనస్సులో త్వరత్వరగా తిరిగిపోయాయి. ఆ రాత్రి ఆమెతో అన్ని విషయాలు మాటాడాడు కాని, మద్రాస్‌లో ఆమె ఇల్లెక్కడో అడగలేదు. ఫరవాలేదు. ఇవాళామెను కలుసుకుని వాళ్ళింటికి వెళతాడు. ఆమె తండ్రితో మాటాడుతాడు. ఆనాటిరాత్రి కలత నిద్దర కలల వలపులు నేటిరాత్రి వాళ్ళకి శాశ్వతమైన దివ్యానుభవాన్ని, స్వర్గానుభవాన్నిచ్చి వాళ్ళ జీవితప్రాంగణంలో ముత్యాలవానలు, వెన్నెలల సోనలు కురిపిస్తాయి. సుందరం సుం

దర స్వప్నంలో విహరిస్తున్నాడు. అతని కళ్ళకేదో మహాసముద్రం తప్ప ఇంకేమీ కనిపించలేదు. అతని చెవులకు సముద్రపుహోరు తప్ప ఇంకేమీ వినిపించలేదు.

"ఏమి సార్, మీరెక్కడ పూడ్చాల ? యీ ట్రాంలోదా మైలాపూర్ తిరిగి రాకూడదు. వెనకాల ట్రాంలో రండిమీ!" అన్నాడు కండక్టరు.

సుందరం ఒక్కసారి బాహ్యప్రపంచంలో కొచ్చి నాలుగువేపులూ పిచ్చివాడిలా చూశాడు. ఖాళీగా, నీరసంగా, నిర్జీవంగా, బోడిగా, నిస్త్రాణంగా ఆగింది ట్రాం, హైకోర్టు ఆవరణప్రక్క.

ఏదో తట్టుకోలేని బాధ అతన్ని నిమేషపాటు నిర్జీవుణ్ణిగా చేసింది. కాని వెంటనే తేరుకుని, ఫక్కున నవ్వి, చరచరా నడువసాగాడు—సముద్రం వైపు.



★ పాకిస్తానే కనుక తమకు లభించనిపక్షాన ముస్లింలందరూ శాసనసభలను బహిష్కరించడమే కాకుండా, పన్నుల నిరాకరణోద్యమాన్ని సహితము వెంటనే ప్రారంభించాలని జిన్నా యత్నమట !

★ కాని బెంగాలులో ముస్లిం ప్రభుత్వం ఏర్పడుతోంది కనుక ఇటువంటి చర్య తీసుకుంటే తమకే నష్టమని సుహ్రావార్డీ జిన్నాకు నచ్చచెప్పితే, 'అదీ నిజమే !' అని ఆవిషయం మరి ఎత్తలేదట !

★ ఆత్మహత్యా దళాలని (సూయిసైడ్ స్క్వాడ్స్) తయారుచేసి అయినా పాకిస్తాన్ సంపాదించాలని జిన్నా కొస ఆశ అట !




ఆరోగ్య జీవనము
మీ అందుబాటులోనే వుంది

మనం ప్రకృతికి దూరమౌతున్నాము
అటులనే ఆరోగ్యానికినీ

కాని, గృహిణి ఆరోగ్యముగ వుండనియెడల, మొత్తము గృహమే అనారోగ్యమై అనాకరవంతమై వుంటుంది. స్త్రీ ఆరోగ్యమును ఏ పరిస్థితులందైనను కాపాడుకోనాలి. స్త్రీకి ఆరోగ్యజీవనము అందుబాటులోనే వుంది.
" లోధ్ర " స్త్రీలకు ఆరోగ్యజీవనమును ప్రసాదిస్తుంది. లోధ్ర సేవనము గర్భాశయరోగములను నిర్మూలించి సౌందర్య సౌఖ్యజీవనమును ప్రసాదిస్తుంది.

సుదతుల సౌఖ్య సౌందర్య జీవనమునకు

లోధ్ర

కేసరి కుటీరం లిమిటెడ్., మద్రాసు.
తెలుగుజిల్లాలకు, నైజాముకు ఏజెంట్లు,
సీతారాం జనరల్ స్టోర్సు, బెజవాడ.